# ఫారిన్ అబ్బాయి

చిట్టెయ్య కొడుకు! ఎవడో అనుకున్నాను. అమెరికాలో మరోసారి "ఎం.ఎస్.సీ." చేసి ఉద్యోగం దొరికితే అక్కడే స్థిరపడిపోయాడు. వాడు దేశం వచ్చాడు. పెళ్ళి చేసుకుని, పెళ్లాన్ని వెంటబెట్టుకునిపోతాడు. నే నెరిగిన చిట్టెయ్య కొడుకే! పద్మనాభం.

అందుకే వెంకటరామయ్య నన్ను బతిమాలుతున్నాడు. ఈ ఫారిన్ సంబంధం వాడి కూతురు జానకికి చూసి పెట్టమని! వెంకటరామయ్య రెవెన్యూ ఉద్యోగి. ఇద్దరు కొడుకులకీ పెద్ద చదువులే చెప్పించాడు. పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. కూతురు "ఎమ్. ఎస్. సి." చేసి రీసెర్చిలో చేరి డాక్టరేటు పుచ్చుకోడానికి సిద్ధంగా ఉంది. ఫారిన్ పెళ్ళికొడుక్కి అన్ని విధాలా తగిన పెళ్ళికూతురు.

వెంకటరామయ్య రెవెన్యూలో గుమస్తాగా చేరిన దగ్గర నుంచి ఘటికుడే. అయితే నోట్లో సంస్కారం, విద్యాగంధం లేవు. అందుకే నన్ను పురమాయించాడు. పాతిక వేలు కట్నమిస్తాననీ, పెళ్ళి ఘనంగా చేస్తాననీ చెప్పేడు. చేస్తాడు.

ఎరిగిన చిట్టెయ్య కదా! ఏంరో అంటే ఏంరో అని పలకరించు కున్నాము. స్వతహాగా చిట్టెయ్య చాలా అల్పుడు. అయినా కొడుకు కొండ మీదికి పోయేడన్న గర్వం మొహంలో కొచ్చేసింది. ఇరుకు సందులో వాడిల్లు చూస్తేనే వాడిలో మార్పు కనబడిపోయింది. కొడుకు నెలనెలా ఏభై డాలర్లు పంపుతున్నాడు. ఇంటిగోడలకి గట్టిగా సిమెంటు అతికించాడు. తెల్లగా వెల్ల వేయించాడు. సావిట్లో ఓ సోఫా పెట్టేడు. నెత్తిమీద దూలానికి ఫేను తగిలించాడు.

చిట్టెయ్యకి వివరాలు చెప్పాను. జానకి చదువు బాగా సరిపోతుంది. "కాస్త ఇచ్చుకోగలడా?" అన్నాడు చిట్టెయ్య!

"వెంకటరామయ్యా రెవెన్యూ వాడు. ముందు పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ చూసుకోనీ" అన్నాను.

"ఎందుకు చెపుతున్నానంటే వాడొచ్చినందుకు, పెళ్ళికూతుర్ని తీసుకువెళ్ళినందుకు చచ్చేటంత అవుతుందయ్యా" అన్నాడు.

"నాకు తెలుసు. నువ్వు నీ కొడుకుని పిలువు. అతన్ని ఆహ్వానిస్తాను."

"చంపేశావు! వాడిక్కడ లేడు. వాడీ ఇంట్లో ఉండగలడా! అది ఎప్పుడో పూర్వం మాట. మనిషి పూర్తిగా మారిపోయాడురా! అంతా అమెరికన్ పద్ధతి. హోటల్లో ఉన్నాడు. మనమే అక్కడికి వెళ్ళి చెప్పుకోవాలి" అన్నాడు. పద్మనాభం ఆ యింట్లోనే పుట్టి అక్కడే పెరిగి, అక్కడ ఉండే చదివి అమెరికా వెళ్ళాడు !

"సరే ఆటోలో పోదాం పదా" అన్నాను.

"చంపేశావు! ఆటోలో వెళ్ళితే ఇంకేమైనా ఉందా? మీదపడి పోతాడు. టాక్సీ కట్టుకువెళ్ళవలసిందే. లేకపోతే వాడికి పరువు తక్కువ. ఇలాంటి పట్టింపులు ఇన్నీ అన్నీ కావు!"

టాక్సీ కట్టుకుని వెళ్ళాం! పెద్ద హోటల్లోనే పద్మనాభం దిగేడు. వాడికి పాశ్చాత్య పద్ధతిని తిండి, పాయఖానా కావాలి. రెండూ ఉన్న హోటల్లో దిగాడు.

వాణ్ణి చూడగానే నా మతిపోయింది. అమెరికానుంచి వచ్చిన నీగ్రో అంటే సరిపోతుంది. నీగ్రో నలుపు నిగనిగలాడుతూ అందంగా ఉంటుంది. ఆ నలుపుకి వ్యామోహపడే తెల్లవాళ్లు కోకొల్లలు ఆడా మొగా. వీడి నలుపు వెలవెలలాడుతూ ఉంది. నెత్తిమీనా అడుగెత్తు వెంట్రుకలు పెంచాడు. చెంప వెంట్రుకలు చెవుల వారనుండి గెడ్డాందాకా దించి పెంచుకున్నాడు. చెవులు వెంట్రుకల్లో కనబడటంలేదు. బొద్దు మీసాలు పెదిమిల మీంచి పెదిమిల ప్రక్కనుంచి కిందికి దించేశాడు. కళ్ళూ ముక్కూ, మూతి వెంట్రుకల సంపద లోంచి ఆనడంలేదు. మూడూ వెంట్రుకల్లో మునిగిపోయాయి. జాంబవంతుడి అవతారంలా వున్నాడు!

జానకి లాంటి పిల్లకి వీడెక్కడి మొగుడు అని అనిపించేసింది. జానకి తెలివైంది. మొహం నిండా నిండి దాని తెలివి కళ్ళల్లో తళతళ్లా

డుతూ ఉంటుంది. తెల్లతోలు! వాడుచూస్తే యం. ఎస్. సి. గాడు. ఇది చూస్తే డాక్టరేటు పుచ్చుకోడానికి సిద్ధంగాఉంది. వాడు అమెరికాలో డబ్బుకి ఏదో ఉద్యోగం. మంచిదో బాడుకాదో చేస్తూన్నాడు.

అక్కడ బాడుకా ఉద్యోగాలు చేస్తూ ప్రగల్భాలు ఇక్కడ చెప్పుకుంటున్న వాళ్ళు వున్నారు.

అయినా ఏం చెప్పగలం? అమెరికా వెళదాం అక్కడ ఉందాం అన్న వ్యామోహం జానకికీ వుందేమో! జాంబవంతుణ్ణయినా కట్టుకుని పశ్చిమార్థ గోళంలోకి ఎగురుదామని కోర్కె వుందేమో! అది ఒప్పుకుంటుందేమో! అనీ అనుమానం వేసింది.

పెళ్ళికూతుర్ని వచ్చి చూడవలసిందిగా పద్మనాభాన్ని ఆహ్వానించాను.

"ఎప్పుడు నన్ను మీరు తీసుకెళ్ళగలరు!" అని ప్రశ్నించాడు. అంటే వాణ్ణి టాక్సీలో మా వూరు తీసికెళ్ళి పిల్లని చూపించాలన్నమాట. ఆ ఖర్చు మనం పెట్టుకోవాలి.

"మధ్యాహ్నం ఒంటిగంటకి" అని నిశ్చయంగా చెప్పాను. పిల్లని చూసి వాళ్ళు సాయంకాలానికి తిరిగి వచ్చెయ్యొచ్చు.

ముందుసీటులో చిట్టెయ్య కూర్చున్నాడు. వెనక పద్మనాభం నేనూ విశాలంగా కూర్చున్నాము. అక్కణ్ణుంచి సిగరెట్లు తెగవూదేస్తూ వాడి ఇంగ్లీషులో వాడి తెలివి నామీద ప్రయోగించడం మొదలెట్టాడు. నిజంగానే వాడి "యాంకీ యాస" పదజాలం నాకు అక్కడా అక్కడా బోధపడడం లేదు.

"మీరు తెనుగులో చెప్పండి! నాకు బోధపట్టంలేదు" అన్నాను.

"తెనుగా! తిన్నగా రాదేమో! సంవత్సరాలైపోయిందేమో వెనక్కిపోయింది. మా అమ్మ దగ్గిరా ఇంగ్లీషు వచ్చేస్తున్నాది! రోజు రోజుకి తెనుగు వెనక్కిపోతున్నాది" అన్నాడు.

రోడ్డు తారు రోడ్డే. ఎదురుగా బస్సు వస్తే తప్పుకునేటప్పుడు కారు తిరిగితే గతుకులూ, గోతులూ, కారు కిందికి మీదికి ఎగురుతున్నాది. అంతట్లో 'స్పీడ్ బ్రేకర్' వొచ్చి కారు ఒక్క ఎగురు ఎగిరి కిందికి పడి కుదుపు కుదిపేసింది.

"ఇక్కడ రోడ్లున్నాయే దిక్కుమాలిన రోడ్లు" అన్నాడు పెళ్ళికొడుకు. వాడు 'ఇక్కడి రోడ్లు' అంటే వళ్లు మండింది. అయినా వూరుకున్నాను.

"మనది ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశం!" అని సంజాయిషీ మర్యాదగా చెప్పేను.

"ఏం దేశమో ఏంపాడో వళ్లు వూనం అయిపోతున్నాది." రోడ్డు వెంట జనం విపరీతంగా పోతున్నారు. పల్లెటూళ్ళ వాళ్ళు మంగళవారం సంతకి పోతున్నారు.

"అబ్బెబ్బెబ్బె! చూడండి. ఇక్కడ మనుషులు మనుషుల్లా లేరు. పశువులు. పశువుల మందలు. రోడ్డుసెన్సు లేదు. ఇక్కడిరోడ్లు ఘోరం. ఇక్కడి మనుషులు మరీ ఘోరం" అన్నాడు.

"ఇక్కడ ఇక్కడ అంటున్నారేం? 'మన' రోడ్లు 'మన' మనుషులు అనండి" అన్నాను. నేను వాణ్ని అమెరికానుంచి వచ్చిన బుద్ధివిహీనుడిగా భావిస్తున్నానని బోధపడినట్టే ఉంది. వాడి నాలికకి అడ్డంగా 'స్పీడ్ బ్రేకర్' తగిలింది.

"మావాడు పూర్తిగా అక్కడివాడై పోయాడు హి హ్హి హ్హి!" అని వాళ్ళ నాన్న చిట్టెయ్య ముందు సీటులోంచి మా సీట్లోకి కొంగలాగ మెడ వాల్చి నవ్వేడు.

"అక్కడ యాంకీలు వీళ్ళని ఏమనుకుంటున్నారో!" అన్నాను. అనకూడదుగానీ అన్నాను, ఏమైనా సెకండ్‌క్లాస్ సిటిజన్లే కదా! పద్మనాభం మొహంలో వెంట్రుకలు చిట్లించుకున్నాయి. మా వూరు వెంకటరామయ్య ఇల్లు చేరేదాకా నోరు విప్పి మరిమాట్లాడలేదు. తోవకడకూ సిగరెట్లు కాల్చుకున్నాడు.

సావిట్లోకి జానకిని రమ్మని వాళ్ళకి పరిచయం చేశాము. మాతో పాటు అదీ ఓ కుర్చీలో కూర్చుంది. పద్మనాభాన్ని పరిశీలనగా చూసింది.

పెళ్ళికూతురికి నచ్చలేదు అని నాకు తెలిసిపోయింది. పెళ్ళికొడుకు మొహంలో భావాలు వెంట్రుకల మధ్య బోధపడకపోయినా వాడి కంఠస్వరంలో ఆమోదం కనబడిపోయింది.

పద్మనాభం వాడికి వాడే పెళ్ళికూతురుతో డైరెక్టుగా మాటలు

ప్రారంభించాడు.

"మీకు అమెరికాలో వెంటనే ఉద్యోగం వస్తుందండీ!" అన్నాడు. పెళ్ళాం కూడా సంపాదనాపరురాలు కావడం కావాలి. డబ్బు కావాలి.

"నాకు ఇక్కడ మాత్రం దొరకదా ఏం?" అని మహా గోరోజనంగా జానకి జవాబు చెప్పింది.

"అక్కడి జీతము, ఇక్కడి జీతంతో చాలారెట్లు గుణించాలి" అన్నాడు. డబ్బు ప్రలోభం!

"డబ్బుకోసం అమెరికా వెళ్ళాలా? రీసెర్చి చెయ్యడానికి అక్కడ అవకాశాలు ఎక్కువ కాబట్టి వెళితే వెళ్ళాలి" అన్నది.

"అందుకైనా అమెరికాలో ఉండాలి. ఏదైనా ఒక్కటే" అన్నాడు పద్మనాభం.

"ఇక్కడ అంత డబ్బు రాదని చెబుతున్నాడు కదా ?" అన్నాడు చిట్టెయ్య. వాడికి పిల్ల నచ్చింది ఖాయమే.

"ఒక్క విషయం నేను ముఖ్యంగా చెప్పాలండీ. నన్ను పెళ్ళి చేసుకునే అమ్మాయి అక్కడ పద్ధతిని బతకడానికి నిర్ణయించుకుని రావాలి" అన్నాడు. పిచ్చిముండా వాడు. జానకి వాణ్ణి ఆమోదిస్తుందనే భావంతోటే అన్నాడు.

"గౌను కట్టుకోవాలాండీ!" అని సాగదీస్తూ అడిగింది జానకి. అందులోని వెటకారం ఆ జాంబవంతుడికి అర్థంకాలేదు!

"కట్టుకుంటున్న వాళ్ళూ ఉన్నారు. కట్టుకుంటే మంచిదే" అన్నాడు.

"జుత్తు 'బాబ్' చేసుకోవాలాండీ" అనడిగింది.

"బాబ్ చేసుకుంటున్నవాళ్ళు చాలామంది వున్నారు. అక్కడ అదే బాగుంటుంది" అన్నాడు.

"అక్కడ వాళ్ళు తిండే తినాలాండీ!" అని అడిగింది.

"నేను అమెరికన్ తిండి మహా ఇష్టంగా తింటాను. ఇక్కడి తిండి నేను తినలేను. మన తిండి కావాలంటే వండుకోవాలి" అన్నాడు. పెళ్ళాం దాని వంట అది చేసుకుతినొచ్చు ననే సూచన వుంది. కథ అడ్డంగా పోతున్నాదని వెంకటరామయ్య కనిపెట్టేడు.

"కాఫీ పంపించు" అని పెళ్ళాన్ని కేకెట్టాడు. పెళ్ళిచూపులు చాలా దూరం వెళ్ళిపోయాయి.

"అక్కడ నీగ్రోలు ఎవరైనా మీకు స్నేహితులున్నారండీ?" అని ప్రశ్నించింది.

"స్నేహితుల్లేరు. మా ఆఫీసులో టైపిస్టు మాత్రం నీగ్రెస్. పెద్దావిడ".

"మిమ్మల్ని అక్కడ నీగ్రోలకన్నా తక్కువగా చూస్తారా? ఎక్కువగా చూస్తారా?"

"చంపేశారు. అక్కడ మనవాళ్ళు అమెరికన్ అమ్మాయిల్ని పెళ్ళాడారు. వాళ్ళని సమాజంలో గౌరవంగానే చూస్తున్నారు. కాని నీగ్రో తెల్లమ్మాయిని పెళ్ళాడినా, నీగ్రెస్ తెల్లబ్బాయిని పెళ్ళాడినా చిక్కులో పడతారు" అని పాపం వివరంగా చెప్పేడు.

"మీరు కాస్త స్నేహాలు పెంచుకుని ఒక నీగ్రెస్‌ని పెళ్ళాడండి. అన్ని విధాలా మీకు తగిన ఇల్లాలు అవుతుంది" అని సలహా యిచ్చింది జానకి.

"అదేంటే ఆ మాటలు?" అని నేనే నిర్ఘాంతపోయాను.

"నీకేం మతిపోయిందా ?" అన్నాడు వెంకట్రామయ్య.

"మీ సలహా కోసం నేనిక్కడికి రాలేదు" అని పద్మనాభం లేచి నిలుచుండిపోయాడు. మొహం వేళ్ళాడేశాడు.

"ఐతే ఇంక మీరు వెళ్ళొచ్చు" అన్నది జానకి.

చిట్టెయ్య ఏదో అందామనీ, ఎవరినంటమో, ఏమి టంటమో బోధపడనివాడిలా మొహం అందరి పక్కకీ తిప్పడం మొదలుపెట్టి వాడూ నిలుచుండిపోయాడు.

వెంకటరామయ్య పెళ్ళాం కాఫీ కప్పులతో ట్రే పట్టుకొచ్చింది.

పెళ్ళికొడుకు గుమ్మం దాటి మెట్లు దిగి కారు దగ్గరికి పోయాడు. వాడి వెంటే చిట్టెయ్య వెళ్ళిపోయాడు.

పెళ్ళికొడుకు బుర్ర చుట్టూ వ్యాపించిన వెంట్రుకల్లోంచి వాడి మనోభావాలు వ్యక్తం కాలేదు.

కాఫీ అయినా తాక్కుండా వచ్చిన తోవనే పోయాడు.